andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిర్మల్
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025



బాసరలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

బాసర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన దసరా నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. బుధవారం ఉదయం పూర్ణాహుతి, ప్రత్యేక అభిషేకంతో అర్చకులు ఉత్సవాలను ముగించారు. పదోరోజు బాసర సరస్వతి అమ్మవారు మహా సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ముగింపు రోజు కావడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయదశమి శుభాకాంక్షలు

● ఎస్పీ జానకి షర్మిల


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాయుధదళ కార్యాలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయుధాలకు ఎస్పీ డా.జి.జానకి షర్మిల పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మిచెట్టుకు, పోలీసు వాహనాలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, సాయుధ దళ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్టమైన బందోబస్తు

నిర్మల్ చైన్‌గేట్ : నిర్మల్ పట్టణంలో గురువారం దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ చర్యలను చేపట్టామని, అందరూ ప్రశాంత నిమజ్జనానికి సహకరించాలని ఎస్పీ జానకి షర్మిల కోరారు. మహాలక్ష్మి దేవాలయం మైదానంలో పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలని రాజేష్ మీనాను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ వారి సూచనలకు అనుగుణంగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకొని ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి అయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా భద్రతాపరమైన అన్ని చర్యలను చేపట్టామన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా విగ్రహ వాహనాలకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని నిర్మల్ ఏఎస్పీకి సూచించారు.

దసరాకు సిద్ధం

● ముస్తాబైన మహాలక్ష్మి, నందిగుండం ఆలయాలు
● తరలిరానున్న వేలాది మంది భక్తులు
● భారీగా క్యూలైన్‌ల ఏర్పాటు

నిర్మల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే అత్యంత భారీగా జరిగే దసరా పండుగ వేడుకలకు ఇక్కడి మహాలక్ష్మి ఆలయం వేదికగా నిలవబోతోంది. ప్రతియేటా ఇక్కడ నిర్వహించే దసరా పండుగ వేడుకలకు దాదాపు 50వేలకు మందికి పైగా భక్తులు హాజరవుతుంటారు. ఈ సారి కూడా అంతకు మించి భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న కారణంగా ఆలయ కమిటీ నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లను చేపడుతున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొడుకల శ్రీకాంత్‌తో పాటు బంగల్‌పేట్ యువజన సంఘం అధ్యక్షులు పెందం శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. ఇక్కడ పండగ వేడుకలకు సంబందించి నిర్వహించే ధర్మ సందేశ వేడుకల సభకు ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్ రెడ్డితో పాటు విశ్వహిందు పరిషత్ బాధ్యులు హాజరుకానున్నారు. వీహెచ్‌పీ బాధ్యులు ధర్మ ప్రసంగాల అనంతరం ఇక్కడి ప్రాంగణంలో చేపట్టే రావణాసుర భారీ దిష్టి బొమ్మ దహన కార్యక్రమం వేడుకలకు హైలేట్‌గా నిలవబోతోంది. ప్రతియేటా రావణాసురి దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని తిలకించేందుకు నిర్మల్ పట్టణం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీసంఖ్యలో జనం తరలివస్తుంటారు. గతానికి భిన్నంగా ఈసారి ప్రత్యేకంగా భక్తుల కోసం బారీకేడ్లను ఏర్పాటు చేశారు. స్థానిక గండి రామన్న ప్రాంతంలోని నందిగుండం దుర్గామాత ఆలయంలో దసరా వేడుకల కోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీ బాధ్యులు లక్కడి జగన్ మోహన్ రెడ్డి, చారీలతో పాటు తదితరులు శరణ్ణవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న కారణంగా వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.


అలంకరణలో మహాలక్ష్మి ఆలయం

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన బీజేఎల్పీ నేత

నిర్మల్‌టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలో దసరా ఉత్సవ ఏర్పాట్లను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ముందుగా బంగల్‌పేట్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ ఏర్పాట్లను, దుర్గా నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, సత్యనారాయణ గౌడ్‌తో పాటు పట్టణ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు శిక్షణ

నిర్మల్‌చైన్‌గేట్ , అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డుమెంబర్ల స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు శిక్షణ కార్యక్రమం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన

కుంటాల : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో వనజ, ఎస్సై అశోక్, ఎంపీవో రహీం, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో ఎన్నికల నియామవళి అమల్లో ఉన్నందున ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

నిర్మల్ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని రూరల్ ఎస్సై నర్సయ్య తెలిపారు. మండలంలోని ఎల్లపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సైబర్ నేరాలు జరిగే విధానాన్ని గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో వీసీ శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక ఉత్సవాలు

కుంటాల, అక్టోబరు, 1 (ఆంధ్రజ్యోతి) : కుంటాలతో పాటు లింబా (కే), అందకూర్, అంబకంటి గ్రామాల్లో బుధవారం ఆర్‌ఎస్ఎస్ వందేళ్ల వ్యవస్థాపక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్తలుగా నాగమణి లింగన్న, వంగల సుధాకర్, కొత్త కాపు నారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో కన్నం ముత్యం, మహేశ్వర్, ఆష్టం భోజన్న, సిం దే సాయినాథ్, గజేందర్, గంగాధర్, రాజు, వినోద్ ఉన్నారు.

గాంధీ జయంతి రోజున జంతువులను వధించరాదు

● మునిసిపల్ కమిషనర్

నిర్మల్ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలో మాంసం, చేపలు, మేకలు, కోళ్లు, తదితర జంతువులు వధించరాదని, విక్రయించరాదని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఉల్లంఘించిన వారిపై తెలంగాణ పురపాలక సంఘం చట్టం 2019 ప్రకారం చర్యలుంటాయన్నారు.

వన్యప్రాణులను కాపాడే బాధ్యత ప్రతి ఒకరిది

సారంగాపూర్ , అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వన్య ప్రాణులను కాపాడే బాధ్యత ప్రతిఒకరిదని చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బాసర సర్కిల్ శర్వానన్ అన్నారు. బుధవారం మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల గండిరామన్న అర్బన్ పార్కులో వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా వన్య ప్రాణుల పోస్టర్లను విడుదల చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులతో పాటు అడవులను కాపాడే బాధ్యత ప్రతి ఒకరిది అన్నారు. అనంతరం వన్యప్రాణులపై అవగాహన కల్పించారు.

గిరిజన తండాల్లో శోభాయాత్ర

ముథోల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని విట్టోలి తండా, రాజు తండా తదితర తండాల్లో బుధవారం జగదాంబ ఆలయంలో సేవాలాల్ మహారాజ్ భక్తులు నవరాత్రులు జరిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సీక్కు చల్లి మొక్కుకున్నారు.

భైంసా : పట్టణవాసులు బుధవారం మహార్నవమి వేడుకలను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా కాలనీల పరిధిలోని దుర్గామాత మండలిల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శరన్నవ రాత్రులు తొమ్మిదోరోజు కావడంతో భక్తులు అధికసంఖ్యలో దుర్గా మండలీలకు తరలివచ్చి భక్తిభావంతో అమ్మవార్లను దర్శించుకున్నారు. పలు మండలీల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరారించాయి.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌లో యువతరంగ్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్మమ్మకు 11తులాల వెండి కిరిటాన్ని విరాళంగా అందజేశారు. యూత్‌సభ్యులు యోగేష్, నిఖిల్, సతీష్, రాజేందర్, బుర్నెల్లి మహేష్, రతన్, నరేష్, ప్రసాద్, కందూర్, నరేష్‌లు రూ.17వేల విలువ గల వెండి కిరిటంతో అమ్మవారిని అలంకరించారు.

రాంపూర్‌లో ఘనంగా బోనాలు

నర్సాపూర్(జి), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్ గ్రామంలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయింది. పండుగలో భాగంగా ఉదయం నుండే మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలను అలంకరించి, వాటిని ఊరేగింపుగా తీసుకురావడానికి సిద్ధమయ్యారు. మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో గ్రామంలోని దుర్గామాత ఆలయం వద్ద నుంచి ఊరేగింపు మొదలైంది. గ్రామానికి చెందిన వందలాది మంది ఆడపడుచులు తలపై మంగళహారతులతో అలంకరించిన బోనాలను ఎత్తుకొని, సంప్రదాయ దుస్తుల్లో ఆలయం ముందు బారులు తీరారు.

కల్నల్‌కు సన్మానం

నిర్మల్‌రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రచయితల వేదిక భారత సేనల తరపున పోరాడిన కల్నల్ కేఆర్.సతీష్ కుమార్‌కు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ నుంచి బాసర వెళ్తూ నిర్మల్ వచ్చిన సందర్భంగా విజయ పాథోలాజికల్ ల్యాబ్‌లో సతీష్‌కుమార్ మాట్లాడుతూ... 35 సంవత్సరాలు సైన్యంలో పని చేశానని తెలిపారు. ఆపరేషన్ విజయ్ మెడల్ భారత ప్రభుత్వం అందించిందని తెలిపారు. మధుకర్ రెడ్డి, డాక్టర్ ఏ.శేఖర్ రెడ్డి, రమేష్, సుమిత్ర, లావణ్య పాల్గొన్నారు.

ఎస్‌ఐకి అభినందనలు

నిర్మల్ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వెలువడిన గ్రూప్- 1 పరీక్షా ఫలితాల్లో డీఎస్పీగా ఉద్యోగం పొందిన బాసర మండలం కిర్గుల్(బి) గ్రామానికి చెందిన ఎస్సై మహేందర్‌ను బుధవారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు సన్మానించారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కరించి పూల మొక్క అందించారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం'

భైంసా, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీఆర్‌ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్ పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల పోరుబాట చేపడుతామని వెల్లడించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాలన తీరుతో విసుగెత్తిపోయిన ప్రజానీకం మళ్లీ కేసీఆర్ సారే కావాలని ,రావాలని గ్రామగ్రామాన కోరుకుంటున్నారని తెలిపారు. ఎక్కడికి వెళ్లిన కేసీఆర్ పాలన తీరునే ప్రస్తావిస్తున్నారని వివరించారు. ఇలాంటి అనుకూలమైన రాజకీయ వాతవరణం నెలకొన్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయబేరి మోగించడం ఖాయమని జోస్యం చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ వైపు అందరూ దృష్టి సారించారని, పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని వెల్లడించారు. ఇందులో పార్టీ కుంటాల,బాసర మండలాల కన్వీనర్లు పడకంటి దత్తాత్రి, కోర్వ శ్యామ్ సుందర్, మాజీ ఎంపీటీసీ దేవిదాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

'మన అభ్యర్థులను గెలిపించుకుందాం'

లోకేశ్వరం : బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని బీఆర్‌ఎస్ ముథోల్ సమన్వయకర్త సమితి సభ్యులు, జడ్పీ మాజీచైర్మన్ లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమురేవార్, విలాస్ గాదేవార్ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. లోకేశ్వరం మండలం పిప్రిలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు.

మారిన నే'తల' రాతలు!

(5వ పేజీ తరువాయి...)

జిల్లాలో స్థానిక ఎన్నికల కోసం ఎంతో ఎదురు చూసిన అనేక మంది నేతల పరిస్థితి రిజర్వేషన్లతో తారుమారయ్యింది. పోటీ చేసేందుకు అవకాశమే లేకుండా పోవడంతో రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడంతో జనరల్ స్థానాలు కనుమరుగయ్యాయి. దీంతో బీసీలతో పాటు ఎస్సీ ఎస్టీ నాయకత్వానికి ఎక్కువగా ప్రాధాన్యత దక్కుతుంది.

ఆశలు గల్లంతే..

గత దశాబ్దా కాలంగా ఎస్టీ రిజర్వుడుగా ఉన్న ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ పదవి ఈసారి జనరల్ మహిళకు దక్కడంతో చాలామంది నేతలు పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. కానీ జడ్పీటీసీ స్థానం రిజర్వేషన్ దక్కక పోవడంతో ఆశలు ఆవిరవుతున్నాయి. ముఖ్యంగా తలమడుగు జడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి అవకాశం వస్తే ఈసారి జడ్పీ చైర్మన్ బరిలో ఉండాలని భావించిన తలమడుగు మండల జడ్పీటీసీ స్థానం ఎస్టీలకు రిజర్వు కావడంతో ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే తాంసి తాజా మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ఈసారి జడ్పీటీసీ పోటీలో ఉండాలని భావించిన జడ్పీటీసీ స్థానం ఎస్సీ మహిళ, ఎంపీపీ స్థానం ఎస్సీ జనరల్‌కు రిజర్వ్‌డు కావడంతో తీవ్ర నిరాశే మిగిలింది. ఇలాంటి పరిస్థితులే ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, బేల మండలాల్లో కనిపిస్తుంది.

నేతల కోసం వెతుకులాట

బలమైన నాయకత్వం ఉన్న రిజర్వేషన్లు కలిసి రాక పోవడంతో ప్రధానపార్టీలు కొత్త నేతల కోసం వెతుకులాటను మొదలు పెట్టాయి. ఈసారి ధీటైనా అభ్యర్థులను బరిలో దింపేందుకు ప్లాన్ చేస్తున్నారు. పాత నేతలకు రిజర్వేషన్లు కలిసి రాకపోవడంతో కొత్త నేతల చేరికలు తప్పనిసరిగా మారాయి. ఇప్పటికే పార్టీలో పని చేస్తున్న కిందిస్థాయి నేతలు టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ పార్టీలో మంచి పలుకుబడి కలిగిన సీనియర్ నేతల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈసారి ఎక్కువగా కొత్త నేతలే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కనిపిస్తుంది. గత్యంతరం లేక ఉన్న నేతలనే గెలిపించుకునేందుకు పార్టీలు పడరాని పాట్లు పడాల్సి వస్తుంది. ఉద్యోగుల కుటుంబ సభ్యులు, వ్యాపారులు ఈ సారి రాజకీయ రంగ ప్రవేశం చేసేందుకు సమయత్తమవుతున్నారు.

అందరి దృష్టి అక్టోబరు 8 పైననే..

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత లేక పోవడంతో రిజర్వేషన్లు ఖరారైన సర్వత్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో విచారణ చేపట్టిన హైకోర్టు అక్టోబరు 8వ తేదీకి వాయిదా వేస్తూ తీర్పునిచ్చింది. దీంతో అందరి దృష్టి అక్టోబరు 8 పైననే పడింది. హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ కనిపిస్తుంది. అంతేకాకుండా ఒకవేళ బీసీ రిజర్వేషన్లు చెల్లవని తీర్పు వస్తే.. పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చే అవకాశం కనిపిస్తుంది. అలాగే 42 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తే బీసీ రిజర్వేషన్లు తారుమారయ్యే అవకాశం లేకపోలేదంటున్నారు. దీంతో జనరల్ స్థానాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని తెలుస్తుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు యధావిధిగానే ఉన్న బీసీ రిజర్వేషన్‌లో మార్పులు ఉంటాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.



ఇచ్చోడలో అమ్మవారిని దర్శించుకుని ఎంపీ గోడం



నేరడిగొండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

వైభవంగా దేవీ విగ్రహ నిమజ్జన శోభాయాత్ర

● పలుచోట్ల ప్రజాప్రతినిధుల ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నవరాత్రుల్లో వాడవాడలా కొలువై ప్రత్యేక పూజలను అందుకున్న దుర్గాదేవి విగ్రహ నిమజ్జన కార్యక్రమాలను భక్తులు ఘనంగా చేపట్టారు. నవరాత్రుల్లో చివరిదైన బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బోజ్జవర్ మందిరంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహ నిమజ్జనం సందర్భంగా భారీ శోభాయాత్రను చేపట్టారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేయగా... భారీ ఎత్తున భక్తులు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇచ్చి వేడుకున్నారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టన పురవీధుల గుండా శోభాయాత్ర కొనసాగడంతో కోలాహల వాతావరణం నెలకొంది.

ఆదిలాబాద్ టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని భక్తిశ్రద్ధల నడుమ ఆరాదిస్తున్నారని, సనాతన ధర్మంలోని పండగల ప్రాశస్త్యాన్ని భావితరాలకు తెలియచెప్పేలా వేడుకలను జరుపుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణంలోని ప్రతిష్ఠించిన దుర్గాదేవి, శారద దేవి మండపాలను బుధవారం ఆయన దర్శించుకున్నారు.

ఇచ్చోడ: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలను బుధవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన వీధులగుండా అమ్మవారి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.

బోథ్: నవరాత్రులలో మాలలు వేసుకున్న వారు కట్టుబాట్లను తమ జీవన విధానంలో ఎల్లప్పుడూ అనుసరించే విధంగా ఉండాలని ఆదిలాబాద్ ఎంపీ జీ నగేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



ఆదిలాబాద్‌లో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

బోథ్: సోనాల మండలంలోని ఘన్పూర్ గ్రామంలోని దుర్గామాతను స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గ్రామస్థులు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

నేరడిగొండ: మండలంలోని కుమారి. తేజాపూర్ గ్రామాల్లో నిర్వహించిన దుర్గాదేవి సేవ సమితి, దుర్గామాత ఉత్సవ సమితి దుర్గా మండపాలను గ్రామస్థుల ఆహ్వానం మేరకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అన్నదాన కార్యక్రమం సందర్భంగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో నైవేద్యం సమర్పించి నగర భోజనాన్ని ప్రారంభించారు.

సిరికొండ: మండలంలో దుర్గాదేవి నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని బోయవాడ, హనుమాన్ గల్లీల్లోనీ హనుమాన్ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

క్రైం సమాచారం

గంజాయి కేసులో మూడేళ్ల జైలు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ పి.శివరామ్ ప్రసాద్ తీర్పు వెలువరించారు. 2021లో ఉట్నూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిందితుడు దుర్గం బాపూరావుపై గంజాయి కేసు నమోదు కాగా... కోర్టు డ్యూటీ ఎక్సైజ్ కానిస్టేబుల్ పి.విశాల్ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ సంజయ్ కుమార్ వైరాగారే నేరాన్ని రుజువు చేయించగా జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. పది వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అంతేకాకుండా నిందితుడికి శిక్ష పడడంలో, కేసు విచారణ చేయడంలో కృషి చేసిన ఎక్సైజ్ సిబ్బందిని డీపీఈవో హిమశ్రీ అభినందించారు.

బెల్టు దుకాణాలపై ఆకస్మిక దాడులు

ఇచ్చోడ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా బెల్టు దుకాణాల ద్వారా విక్రయిస్తున్న మద్యంను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో బుధవారం సీసీఐ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇచ్చోడకు చెందిన ఓ బెల్టు దుకాణంపై దాడులు నిర్వహించగా.. రూ.36 వేల విలువైన మద్యం సీసాలను స్వాధీనం పరుచకున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కడెం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాజీపేట్ జాతీయ రహదారిలో టాటా మ్యాజిక్, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన రొడ్డ చందు(28) అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న కడెం ఎస్సై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడెం ప్రధాన కాలువలో ఒకరి గల్లంతు

దస్తురాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కడెం ప్రధాన కాలువలో పడి ఒకరు గల్లంతైన ఘటన దస్తురాబాద్ మండలం రేవోజిపేట్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన మైదం సురేందర్ (45) బుధవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో కడెం ఎడమ ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. బాధితుడి భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ము మ్మరం చేశారు. స్థానికులు సహా రెస్క్యూ సిబ్బంది కెనాల్‌లో గాలిస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృత్యువాత

నర్సాపూర్(జి), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుస్లిలో బుధవారం రైతు ఆర్.గంగాధర్‌కు చెందిన ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.60,000ల వరకు ఉంటుందని, దీని మృతితో తమ కుటుంబం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు.

రూ.3.5 లక్షల నగదు పట్టివేత

దిలావర్‌పూర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎలాంటి పత్రాలు లేకుండా రూ.3.5 లక్షల నగదును తరలిస్తున్న వ్యక్తిని దిలావర్‌పూర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం దిలావర్‌పూర్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా భైంసా పట్టణానికి చెందిన ఠాకూర్ తరుణ్‌సింగ్ అనే వ్యక్తి వద్ద సరైన పత్రాలు లేకుండా రూ.3 లక్షల 50 వేల నగదు లభించింది. దీంతో పోలీసులు ఆ నగదును సీజ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి

● ఆడే గజేందర్ సమక్షంలో పార్టీలో చేరికలు

నేరడిగొండ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంటాల తాజామాజీ సర్పంచ్ ఎల్లుల అశోక్ ఆధ్వర్యంలో దాదాపు 70 మంది గ్రామస్థులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆడే గజేందర్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఒక లెక్క ఇక్కడి నుంచి ఒకలెక్క అని, కుంటాల గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేసే బాధ్యత నాదే అని అన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఎల్లవేళల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎల్లుల అశోక్‌ను సాధారణంగా స్వాగతం పలికారు. అనంతరం తాజామాజీ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పుల పాలయ్యానని, కుంటాల గ్రామ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే దగ్గర సర్పంచ్‌లకే గౌరవం లేదని, ప్రతిసారి మమల్ని అవమానించారని చెప్పుకొచ్చారు. పార్టీలో చేరిన వారిలో జాదవ్ సుభాష్, కృష్ణ, పవర్ సందీప్, కిష్టయ్య, జింక నరేష్, రాథోడ్ ప్రకాష్, పోతన్న, బట్టు అనిల్, జింక రమణ, భూమేష్, పవలె గోవింద్, గొల్లపల్లి రాజేందర్, దావుల రవి, బోగి రాజేందర్, పి మహేష్, జింక మల్లేష్ తదితరులు ఉన్నారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాయిడి రవి, ఆత్మ డైరెక్టర్లు స్వామి, కుంట శంకర్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొమురంభీం వర్ధంతికి సీఎంని ఆహ్వానించిన ఎమ్మెల్యే

ఉట్నూర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జల్ జంగల్ జమీన్ కోసం ఆదివాసుల హక్కుల రక్షణ కోసం పోరాడి వీర మరణం పొందిన ఆదివాసీ గిరిజన వీరుడు కొమురంభీం వర్ధంతికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం ఆహ్వానించడం జరిగిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ తెలిపారు. ఈ నెల 7న కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామంలో నిర్వహిస్తున్నందున వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కొమురంభీం మనువడు కుంరంసోనేరావుతో కలిసి సీఎం అనుముల రేవంత్‌రెడ్డిని ఆహ్వానించామన్నారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుని ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కేలాపూర్ జగదంబ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని ప్రసిద్ధిగాంచిన కేలాపూర్ జగదంబ మాత ఆలయాన్ని బుధవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పాలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతి ఏడాది నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి భారీ సంఖ్యలో ఆదిలాబాద్ నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. దుర్గమ్మ దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.

ఉట్నూర్: మండలంలోని హస్నాపూర్ కొలువైన శారదదేవిని బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్క దర్శించుకున్నారు. దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు, బతుకమ్మ సంబరాల్లో భాగంగా కొలువుదీరిన శారదదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో కలిసి దాండియా నృత్యంలో పాల్గొని వారిని ఉత్సాహ పరిచారు. ఇందులో నాగపూర్ మాజీ సర్పంచ్ సునిల్ జాదవ్, సంతోష్, విశాల్, సతీస్, రాందాస్, రాజ్, విష్ణుదాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 353బీ నిర్మాణంలో భాగంలో తర్నం వాగుపై నిర్మించినలో లెవెల్ వంతెన వద్ద తరచూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, కాంట్రాక్టర్ ఇరువైపులా రోడ్ల కనెక్టివిటీ సరిగా ఏర్పాటు చేయకపోవటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని భోరజ్ మండల బీఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్‌ను కలిసి వంతెన కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. నాలుగు కోట్ల 50 లక్షలతో లో లెవెల్ వంతెనను నిర్మించారని, కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం బ్రిడ్జి నిర్మించిన 24 నెలల వరకు ఎటువంటి సమస్యలు ఉన్న దాన్ని సరి చేయవలసిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉందని అన్నారు. సమస్యలను పలు మార్లు అధికారుల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని పేర్కొన్నారు. బ్రిడ్జి పైన ఇప్పటివరకు ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని, సంబంధిత కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

స్థానిక ఎన్నికలకు కార్యాచరణ : కంది

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరపున జడ్పీటీసీ, ఎంపీటీసీలుగా పోటీచేసే అభ్యర్థుల విషయంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి కార్యాచరణ సిద్ధం చేశారు. బుధవారం తన క్యాంపు ఆఫీస్ లో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో గెలిచే సత్తా ఉన్న అభ్యర్థుల ఎంపిక కోసం ఆశావహుల జాబితా సిద్ధం చేయడానికి మండలాల వారీగా ఇంచార్జిలను నియమించారు. ఒక్కో మండలానికి దాదాపు ఎనిమిది నుంచి పది మంది సమర్థులైన నాయకులను నియమించి పోటీ కి తగిన విధంగా ఉండే అభ్యర్థుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. వారిచ్చిన జాబితాను అధిష్టానం సూచనలు, సలహాలతో వడపోసి అభ్యర్థులను ఎంపిక చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్: గంగ పుత్ర సంక్షేమ సంఘం షెడ్డు నిర్మాణం కోసం ఎఎఫ్ నిధుల నుంచి లక్షలు రూపాయలు కేటాయించిన అదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డికి సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్లుల భోజన్న ధన్యవాదాలు తెలిపారు. నిధులు విడుదల కావడంతో జిల్లా గంగపుత్ర సంఘం ఆఫీస్‌లో షెడ్డు పనుల కోసం భూమి పూజ జరిపినట్టు తెలిపారు. మున్ముందు కూడా గంగంపుత్రుల సంక్షేమం అభివృద్ధి కోసం పాడుపడతానన్న కంది శ్రీనివాస రెడ్డికి తాము రుణపడి ఉంటామని అన్నారు. ఆయనకు కూడా ఎల్లవేళలా తమ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మేకల అశోక్, డైరెక్టర్లు , కులస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రిటైర్డ్ సూపరింటెండెంట్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పోరేషన్ రిటైర్డ్ సూపరింటెండెంట్ ఉష్కం శంకర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆయనకు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి స్వాగతించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కలిసి పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

పోలింగ్ నామినేషన్ స్వీకరణ కేంద్రాల పరిశీలన

బోథ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కౌటా(బి) గ్రామంలో పోలింగ్ కేంద్రంతో పాటు ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నామినేషన్ పత్రాల స్వీకరణ సందర్భంగా అన్ని రకాల వసతులు ఉంచాలని స్థానిక గ్రామ కార్యదర్శికి సూచించారు. అంతేకాకుండా స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సాత్నాల మండలానికి చెందిన బోడగుంట్ల సతీష్ బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరగా... ఆయనకు మాజీ మంత్రి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, దేవన్న, లక్ష్మణ్, ప్రమోద్, మతిన్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి నెట్‌వర్క్ లక్ష్యం : ఏజీఎం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ మారుమూల గ్రామానికి నెట్వర్క్ అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఏజీఎం సీతారాం అన్నారు. సంస్థ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం సీతారాం మాట్లాడారు. ప్రతి పల్లెకు నెట్వర్క్ అందించాలనే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ స్వదేశీ బీఎస్ఎన్ఎల్ ప్రాజెక్టు చేపట్టారని తెలిపారు. అందుకు అనుగుణంగానే జిల్లాలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, డిసెంబరు నాటికి పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ జెస్సీ, ఎస్‌డీఈలు ప్రమోద్ కుమార్, హరిశంకర్, రవీందర్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి ఎన్నికల సామగ్రి

బోథ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సోనాల, బోథ్ మండలాలకు బుధవారం ఎంపీటీసీ ఎన్నికల సామగ్రి చేరుకుంది. గతంలో గ్రామ సర్పంచుల ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి చేరుకోగా ఈసారి ఎంపీటీసీ ఎన్నికల సామాగ్రి చేరుకుంది. ఆదిలాబాద్ నుంచి ఎన్నికల సామగ్రిని పంపించడంతో ఆయా మండల కార్యాలయాలలో ఎంపీడీవోలు దుర్గం రాజేశ్వర్, రమేష్‌లు సామాగ్రిని భద్రపరిచారు.

సంక్షేమ పథకాల అమలుకు కాంగ్రెస్ కృషి

బోథ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని దశల వారీగా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేరుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సోనాల మండలంలోని కోటకే గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. వారిని కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు

● కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజర్షి షా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారని అన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణకు ప్రత్యేకమని కలెక్టర్ అన్నారు. జిల్లా ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల ఖర్చు నివేదికలను దాఖలు చేయని పార్టీ తొలగింపు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఖర్చు నివేదికలను దాఖలు చేయనందుకు ఒక రాజకీయ పార్టీని రిజిస్టర్ పార్టీల జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా మంగళవారం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవ ప్రజారాజ్యం పార్టీ మూడు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించ వార్షిక ఆడిట్ చేయబడిన ఖాతాలను నిర్దేశించిన గడువు తేదీలోపు సమర్పించలేదని గమనించినట్లు తెలిపారు. నవ ప్రజారాజ్యం పార్టీ ఎన్నికల్లో పోటీ చేసింది కానీ నిర్ణీత వ్యవధిలోపు అంటే అసెంబ్లీ ఎన్నికల విషయంలో 75 రోజుల్లోపు, లోక్‌సభ ఎన్నికల విషయంలో 90 రోజుల్లోపు ఖర్చు నివేదికలను దాఖలు చేయలేదన్నారు. ఆర్టికల్ 324, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29ఏ కింద ఎన్నికల కమిషన్ తన అధికారాలను వినియోగించుకుంటూ పార్టీని రిజిస్టర్ పార్టీల జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. ప్రాతినిధ్యం ఏమైనా ఉంటే పార్టీ అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారికి అఫిడవిట్ సమర్పించాలన్నారు. ఈనెల అక్టోబర్ 8 తేదీన విచారణ ఉంటుందని, పార్టీ అధ్యక్ష, కార్యదర్శి హాజరు కావాలన్నారు. ఎలాంటి సమాధానం రానిపక్షంలో ఎన్నికల కమిషన్ రద్దు చేస్తూ ఉత్వర్వులు జారీ చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎన్నికల దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): 2వ సాధరణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో జడ్‌పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికల దృష్ట్యా నామినేషన్‌లు, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్ ఇతర ఎన్నికలకు సంబంధించి సమాచారం, సందేహాలకు కంట్రోల్ రూమ్ టూల్ ఫ్రీ నెం.18004251939కు కాల్ చేయవచ్చని ఆయన ఈ సందరర్భంగా పేర్కొన్నారు.

...మీడియా సెంటర్ ప్రారంభం

ఆదిలాబాద్ టౌన్: గ్రామపంచాయతీ రెండవ సాధరణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా మీడియా సెంటర్‌ను కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీల రెండవ సాధరణ ఎన్నికల సందర్భంగా బుధవారం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జిల్లా మీడియా సెంటర్, ఎంసీఎంసీను ప్రారంభించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు మీడియా కీలకపాత్ర పోషించనుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో మీడియాలో ప్రచురితమయ్యే సమాచారం న్యాయపరంగా, నియమ నిబంధనలకు లోబడి ఉండాలని, ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్‌పై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా వేసిందన్నారు. పెయిడ్ న్యూస్‌ను గుర్తించేందుకు జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రచార మాధ్యమాలు తగిన నైతికత, ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలన్నారు. ఒకవేళ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు మీడియా ద్వారా చెల్లింపు ఆధారంగా ప్రచారం చేయించినట్లుగా గుర్తిస్తే, ఆ ఖర్చు ఆయా అభ్యర్థుల ఎన్నికల ఖర్చు లెక్కల్లో చేర్చబడుతుందని, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు శ్యామలాదేవి, రాజేశ్వర్, డీపీఆర్‌వో తిరుమల పాల్గొన్నారు.



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి రాథోడ్

నార్నూర్‌లో టెలీ మెడిసిన్ సేవలు

ఆదిలాబాద్(నార్నూర్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా స్వశోధన్ ట్రస్ట్ టెలీ మెడిసిన్ ఆస్పత్రిని బుధవారం జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, వ్యవస్థాపకుడు కరుణాకర్ రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యాధికారి మాట్లాడుతూ పీహెచ్‌సీ విలేజ్ క్లినిక్ వచ్చిన రోగులు సంబంధిత వ్యాధుల పరీక్షలు చేయాలన్నారు. వారికి వైద్య నిమిత్తం స్పెసియాలిటీ వైద్యులకు టెలీ మెడిసిన్ ద్వారా హబ్‌లోని వైద్యులను ఆడియో, వీడియూ కాల్ రూపంలో మాట్లాడి సలహా సూచనలు తెలియజేయాలన్నారు. దీంతో వారు ప్రిస్క్రిప్షన్ తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీం గంగాసింగ్ రాథోడ్, వైద్యులు రాంబాబు, జితేందర్ రెడ్డి, ఏఓ ప్రశాంత్, తులసీదాస్, సంజయ్ ఆడె, జవహర్, చరణ్ దాస్, గ్రామస్థులు బాలాజీ, ప్రణిత బాణోత్, విలాస్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

బోథ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అంతటా సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగంతో పాటు మండల పరిషత్ అధికారులు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగానే సోనాల, బోథ్ మండలాలలో సమస్యాత్మక గ్రామాల గుర్తింపులో వారు నిమగ్నమయ్యారు సోనాల మండలంలోని గుర్రాలతండా, ఘన్పూర్, చింతలబోరి, సోనాల, సాకేర గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. అదేవిధంగా బోథ్ మండలంలోని బోథ్, పొచ్చెర, ధనుర్, కుచలాపూర్, కనుగుట్ట, కౌటా, మరలపెల్లి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. అయితే ఆయా గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రత్యేక నిఘా పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు దృష్టి సారించారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
1
గురువారం 2 అక్టోబరు 2025





2 లో

వైభవంగా దేవీ నిమజ్జన శోభాయాత్ర

ఆదిలాబాద్‌లో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారి విగ్రహం

- నవరాత్రుల్లో విశేషంగా పూజలందుకున్న అమ్మవారు
- చివరిరోజు దేవీ విగ్రహాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు.. స్థానిక చెరువుల్లో నిమజ్జనం



మారిన నే'తల' రాతలు!

స్థానిక ఎన్నికల రిజర్వేషన్‌లు.. ఖరారు కావడంతో జిల్లాలో పలువురు నేతల తలరాతలు తారుమారయ్యాయి. ఈసారి ఎన్నికల బరిలో నిలిచే అవకాశమే లేకపోవడంతో నేతలంతా దూరందూరంగానే ఉంటున్నారు. గతంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీలుగా పని చేసిన నేతలంతా.. నిరాశతో కనిపిస్తున్నారు. ఇన్నాళ్లు స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు సేవా కార్యక్రమాలతో పాటు మండల అభివృద్ధికి ఎంతో కృషి చేసినా.. వారికి అవకాశమే దక్కకుండా పోయింది.

- ఆదిలాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)



2 లో

- జిల్లాలో రిజర్వేషన్లు అనుకూలించక పోవడంతో స్థానిక ఎన్నికలకు దూరం
- ప్రశ్నార్థకంగా మారిన ముఖ్య నేతల రాజకీయ భవిష్యత్తు
- బరిలోకి కొత్త నేతలు.. టికెట్ల కోసం లాబీయింగ్
- బీసీ రిజర్వేషన్ల పెంపుతోనే జనరల్ స్థానాలు తారుమారు

జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు : కలెక్టర్ 3